ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





28,122 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 28122 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 3306 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 60.36 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ధాన్యం డబ్బులు కూడా చాలా ఆలస్యంగా వస్తాయని, ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు రోజుల్లోనే డబ్బులు జమవుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న జెసి

పంచాయతీ సొమ్ము స్వాహా..!

- రూ.1.15 కోట్లు హాంఫట్
- ఓ ఉద్యోగి చేతివాటం
- సొంత ఖాతాలో జమ

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు గ్రామపంచాయతీలో ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు.. గ్రామ పంచాయతీకి వివిధ రూపాల్లో రావాల్సిన నగదును తమ సొంత ఖాతాలో మళ్లించుకున్నట్లు తెలిసింది. అక్కడ అవినీతి, అక్రమాల్లో ఆయన ఘనపాటిగా చెబుతున్నారు. పంచాయతీ ప్రజలు వివిధ రూపాల్లో చెల్లించిన నగదుకు గుట్టుచప్పుడు కాకుండా స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. పట్టణంలోని అయనకు యూనియన్ బ్యాంకులో ఖాతానెంబర్ 033310100145896 వ్యక్తిగత ఖాతా ఉంది. ఇటీవల పంచాయతీ అధికారులు జరిపిన విచారణలో వాస్తవం అయినట్లు తేలినట్లు సమాచారం. ప్రాథమికంగా రూ. 1కోటి పదిహేను లక్షల రూపాయలు పక్కదోవపట్టినట్లు నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు కోవూరు మండలపరిషత్ అధికారులు అందజేసినట్లు తెలుస్తోంది. పంచాయతీ ద్వార వచ్చిన ప్రతి రూ పాయి గ్రామాభివృద్ధికే ఖర్చుచేయాలి. ఇందుకోసం ప్రత్యేక ఖాతా అధికారంగా ఉంటుంది. ఆ ఉద్యోగి సొంత ఖాతాలను తెరిచి, అందులో పంచాయతీ నిధులు జమచేయి ంచుకున్నట్లు తెలిసింది. వివిధ పనులకు సంబంధించిన నగదు మూడవ వ్యక్తికి చెల్లించకుండా ఆయన ఖాతాలో సర్దుబాటు చేసుకున్నట్లు చూపించడం సమాచారం. ఈ ఉద్యోగి గతంలో పంచాయతీ కార్యదర్శిగా వింజమూరు గ్రామ పంచాయతీ, కోవూరు గ్రామ పంచాయతీలో పనిచేసిన కాలంలో గ్రామ పంచాయతీలో నిర్వహించిన పలు లావాదేవీలు నేరుగా మూడో పార్టీకి చెల్లించ కుండా ప్రభుత్వ నిభందనలకు వ్యతిరేకంగా నగదు మళ్లింపు చేసినట్లు తెలిసింది. కోవూరు యూనియన్ బ్యాంక్‌లో పంచాయతీ కార్యదర్శి, కోవూరు గ్రామ పంచాయతీపేరున గల ఖాతాకు సర్దుబాటు చేసి, అ నగదును ప్రయివేటు వ్యక్తుల పేరున చెక్కులు రాసి నగదు చెల్లింపులు చేసినట్లు సమాచారం. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. ఇలా చేయడంతో గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని, పంచాయతీరాజ్ చట్టం చెబుతోంది. ఆర్థిక సంవత్సర వారీగా కోవూరు గ్రామ పంచాయతీలో విచారణ జరిపారు. రశీదు వారీగా పరిశీలించగా, మొత్తం నిబంధనలకు విరుద్ధంగా గ్రామపంచాయతీ నగదు దారి మళ్లింపు కింద చెల్లింపులు చేశారని, అధికారులు జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పించినట్లుగా తెలిసింది ఇక్కడ అవినీతిని గుర్తించిన అధికారుల వింజమూరుకు బదిలీ చేశారని సమాచారం. శాఖాపరమైన చర్యలు తీసుకొని నగదు రికవరీ చేయాల్సిన అధికారులు కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. 2021-2020 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు కోవూరు గ్రామ పంచాయతీలో పనిచేసిన పూర్తి కాలపు, కాంట్రాక్టు పారిశుధ్యపు, ఇతర సిబ్బంది జీతాలు సిబ్బంది బ్యాంకు ఖాతాలకును జెడ్‌పిపిఎఫ్ నిధులకు నేరుగా సర్దుబాటు చేయకుండా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పై బ్యాంకు ఖాతాకు సర్దుబాటు చేసుకున్నారు. అందులో కొన్ని సెల్ఫ్ ద్వారా, మరికొన్ని ప్రయివేటు వ్యక్తుల ద్వారా నగదు విత్ డ్రా చేయించుకొని ఆ తదుపరి నగదు చెల్లింపులు చేసినట్లు సమాచారం. రూ.81,39,361. దుర్విని యోగం జరిగినట్లు,. 2019-2020 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-2024 ఆర్థిక సంవత్సరం వరకు సంబంధించి బ్యాంకు ద్వార వచ్చిన వడ్డీని ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే ఖర్చు చేసి రూ.11,314. దుర్విని యోగం చేసియున్నారని నివేదిక తయారు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులను, సర్పంచ్ లను తప్పుదోవ పట్టించి నగదు బదిలీ కింద మొత్తం రూ. 1,15,95,388/-లను, గ్రామ పంచాయతీలో వివిధ పనుల నిమిత్తం చెల్లించాల్సిన మొత్తాలను వ్యక్తిగత ఖాతాకు జమచేసుకున్నట్లు అధికారులు లెక్కలు తయారు చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎఓపిఆర్‌డి శ్రీనివాస్ విచారణ జరిపి లెక్కలు తేల్చినట్లు తెలిసింది. ఓ ఉద్యోగి ప్రభుత్వం, ప్రజల నగదును దర్జాగా స్వాహా చేసి, యథేచ్ఛగా మళ్లీ ఉద్యోగంలో కొనసాగడం పట్ల ఉద్యోగులు చెవులు కొరుకుంటున్నారు. వాస్తవాలు బయటపెట్టి ప్రజల నగదును రికవరీ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



50 శాతం రాయితీతో అధికలోడు క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు గృహ విద్యుత్ వినియోగ దారులకు విద్యుత్ శాఖ అధిక లోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ 30.06.2025 కు పూర్తవుతుందని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఇ వి.విజయన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం కోటమిట్ట లోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో నెల్లూరు టౌన్ డివిజన్ అధికారులతో ఆయన డివిజన్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ క్రమబద్ధీకరణకు ఇచ్చే రాయితీ వివరాలు తెలియజేశారు. విద్యుత్ సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశా ఎట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ను వినియోగదారులు వినియోగించు కోవాలని తెలియజేశారు.



మాట్లాడుతున్న కమిషనర్ వై.ఓ. నందన్

టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ టౌన్ ప్లానింగ్ విభాగంతో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నగరంలోని అన్ని డివిజన్లలో భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై అడ్డుగా ఉంచకుండా తొలగించాలని ఆదేశించారు. ఇంకనూ ఇవ్వాల్సిన ఛార్ట్ షీట్లు పూర్తి చేయాలని, ఎంఎస్ఎంఈ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. మీటింగ్ అనంతరం వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు అందరికీ టౌన్ ప్లానింగ్ సంబంధించిన డైరీలను అందజేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ పద్మజ ఎ.సి.పి. లు వేణు ప్రకాష్, సూపరింటెండెంట్ పద్మ, సిబ్బంది, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కూటమిలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

కూటమి ప్రభుత్వ పాలనలో విధ్వంసం కొనసాగుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులు, కార్యకర్తల పట్ల వివక్షత ప్రదర్శిస్తోందని, ఇబ్బందులకు గురిచేస్తున్న వారెవ్వరినీ విడిచిపెట్టమన్నారు. రైతులు ధాన్యం అమ్ముకోవడానికి కూటమి ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో విధ్వంస పాలన కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు మండలాల వారీగా సమావేశాలు ఏ ర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజలపై అదనపు ఛార్జీలు మోపొద్దు

సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన అదనపు బిల్లుల ఛార్జీలు ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, కరెంటు బిల్లులతో పాటు అదనంగా వేసిన ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై వేసిన అదనపు భారాలు తగ్గించాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కరెంటు ఛార్జీల పేరుతో అదనంగా ప్రజల పైన ట్రూ అప్, ఇంధన సర్దుబాటు పేరుతో పెద్ద ఎత్తున భారాలు మోపిందని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి వస్తే వాటిని రద్దు చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు , ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు బిల్లులపై అదనంగా వేసినటువంటి ట్రూ అప్ ఛార్జీలు తగ్గించకపోగా ఇంకా అదనంగా పెంచడం దుర్మార్గమన్నారు. గతంలో రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగలగొట్టండని చెప్పినటువంటి అధికార పార్టీ నాయకులు, నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై స్మార్ట్ గా భారాలు వేయడం దారుణమన్నారు. గతంలో అదాని తో చేసుకున్నటువంటి సెకి ఒప్పందంలో దాదాపు రూ.1750 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నటువంటి కూటమి నాయకులు ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తామని చెప్పి దానినే కొనసాగించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా సరే ఇంధన సర్ ఛార్జీల, ట్రూ అప్ పేర్లతో కరెంటు బిల్లులపై అదనంగా వేస్తున్న భారాలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం కరెంటు బిల్లులను దహనం చేసి, విద్యుత్ ఎస్ఇకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ నాయకులు కే. పెంచల నరసయ్య, ఎస్‌డి రఫీ అహ్మద్, ఎం.మాల కొండయ్య, ఎస్‌కె షాహినా బేగం, ఒంగోలు సుధీర్, పోతురాజు శ్రీనివాసులు, ఎస్‌కె షంషాద్, ఆర్వి రావు, ఎస్.కె నజీర్, ఎండి సత్తార్, సిహెచ్ రత్నం, రమణయ్య, కే కష్ణమూర్తి, వై ఈశ్వరయ్య, జై ప్రకాష్, జావీద్, అమ్ములు, రాజేశ్వరమ్మ, నారాయణరెడ్డి, గోను చైతన్య, మహేష్, ఖాదర్ బాషా, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, ఓబుల్ రెడ్డి, లవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆశాలను రెగ్యులరైజ్ చేయాలి


ప్రజాశక్తి-నెల్లూరు: పేద ప్రజలకు వైద్య ఆరోగ్యసేవలను సకాలంలో అందిస్తున్న ఆశా వర్కర్స్‌ను ప్రభుత్వకార్మికులుగా గుర్తించాలని, దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం చెల్లించడంతోపాటు పెన్షన్ అందజేయాని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టరు సుజాతను కలిసిన యూనియన్ నాయకులు తమ సమస్యలను ఆమెకు వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్స్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిసి తమ సమస్యలను వివరించి పరిష్కరించేందుకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. ఎన్.హెచ్.ఎం పథకం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఆశాలకు కనీస వేతనం చెల్లించడం లేదన్నారు. విధి నిర్వహణలో ప్రమాద వశాత్తు మృతి చెందిన ఆశా వర్కర్ కి గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. గడిచిన 7 సంవత్సరాల కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు రూ.1000లు మాత్రమే పెచిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశాలను రెగ్యులరైజ్ చేయడంతోపాటు కనీస వేతనంగా రూ. 26 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పుచేయాలని, దేశం అంతా ఒకేరకమైన పని పరిస్థితులు ఉండేలా ప్రభుత్వం వ్యవహరించాలని, పెన్షన్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్.మధుసూధనమ్మ, ఎస్ కళ్యాణి, ఎ.వాణి, ఏ.జీవా, కె.సునీత, ఎస్.గీత, కె.సురేఖ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

న్యాయం చేయండి సారూ..

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్: భూ సేకరణలో మాకు జరిగిన అన్యాయంపై, విచారించి, న్యాయం చేయాలని, అధికారులను వేడుకుంటున్న దళిత కుటుంబం గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో పరిశ్రమల కోసం భూసేకరణ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ భూసేకరణలో అధికారుల చేతివాటం వల్ల, చేవూరు దళిత కాలనీకి చెందిన అక్కిల గుంటచిన్నయ్య వారసత్వంగా వచ్చిన భూమి కొనుగోలు ద్వారా వచ్చిన భూమితో కలిపి 60 సెంట్లు ఉంది. సర్వే నెంబరు 569,548,554,584, 889లలో, ఈ భూమి ఉందని భూసేకరణ ప్రారంభం నుండి, మాకు, 1బి అడంగల్, రిజిస్ట్రేషన్, ఉన్నాయని మా భూమి కి నష్టపరిహారం చెల్లించమని కాళ్లు అరిగిపోయేలా, తిరిగామని వాపోయారు. అఖిల గుంట చిన్నయ్య, మరియమ్మ, వారి కుమారుడు డేనియల్ సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కు తెలియజేశామన్నారు. వీఆర్వో దగ్గర నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకు, ఈ భూమికి, మీకే నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. తీరా డబ్బులు వేసే సమయానికి, అఖిల గుంట చిన్నమ్మ సుబ్బయ్యకు వీలునామా ఉంది అనే పేరు తోటి, 33.1/2 సెంట్లు కు, అకౌంట్లో డబ్బులు జమ చేశారని మాది న్యాయం అని అధికారులు చెప్పి, డబ్బులు వేసే సమయానికి డూప్లికేట్ వీలునామా తెచ్చిన వారికి డబ్బు జమా చేయడం ఎంతవరకు న్యాయం అని దళిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై గురువారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజను కలవగా, వీలునామా ప్రకారం, డబ్బులు జమ చేశామని, మీది న్యాయం అనుకుంటే, కోర్టుకెళ్లమని చెప్పారని, వారు తెలిపారు. కోర్టుకెళ్లే స్థోమత మా దగ్గర లేదని పై అధికారులు, స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, తిరిగి వారి దగ్గర నుండి మాకు రావాల్సిన డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను వేడుకున్నారు.



ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-లింగసముద్రం: ఎస్ఐగా ఎం.నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మహమ్మద్ సుభానిని ఉన్నతాధికారులు విఆర్‌కు బదిలీ చేశారు. పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న నారాయణను బదిలీపై లింగసముద్రం ఎస్ఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించడంతోపాటు అసాంఘిక కార్యక్రమాలకు చోటు లేకుండా పనిచేయడం జరుగుతుందని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రజలతో మమేకమై పనిచేయడం జరుగుతుందని తెలియజేశారు



సునీత విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త సునీత విలియమ్స్ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి సురక్షితంగా భూమికి తీసుకువచ్చిన నాసా, స్పేస్ ఎక్స్ బృందాల కృషి అభినందనీయమని, విజ్ఞాన శాస్త్రం సాధించిన ఒక అద్భుత విజయమని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో పయనించాలని కీళ్ళ, ఎముకలు, నరముల వ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ శ్యాం ప్రసాద్ శశాంక్ అన్నారు. శుక్రవారం, డైకస్ రోడ్ సెంటర్ లోని వియాని హోంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్) నిర్వహించిన సునీత విలియమ్స్ అభినంద సభలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజుల పర్యటన నిమిత్తం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో తొమ్మిది నెలలు రోదసిలో ఉండడం, ఇలాంటి కష్టపరిస్థితులలో మానసిక ధైర్యాన్ని కోల్పోకపోవడం సునీత విలియమ్స్ గొప్పతనం అని ఆయన ప్రశంసించారు. కల్పనా చావ్లా, యూరిగగరిన్, సునీత విలియమ్స్ లాంటి ఎందరో అంతరిక్ష శాస్త్రవేత్తలు సమాజం కోసం తమ జీవితాల్ని పణంగా పెట్టారని ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పి.హెచ్.పి గౌరవాధ్యక్షులు జయప్రకాష్, వియాని హోమ్ సిస్టర్స్ రమ, జయ, జిల్లా పి.హెచ్.పి నాయకులు షేక్ సత్తార్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఎస్.రాము పాల్గొన్నారు.



చిన్నారులకు బిస్కెట్‌లు పంచుతున్న దృశ్యం

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలో పలు మెడికల్ షాపులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ , ఔషద నియంత్రణ శాఖ అధికారులు , పోలీసు ఈగల్ బృందం సభ్యులు సంయుక్తంగా శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎపి డిజిపి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అధి కారులు మెడికల్ షాపులపై తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్య ంలో జిల్లాలో సైతం ఈ తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో నిషేధిత మందులు, వైద్యుడి చీటీలు లేకుండా మందులు విక్రయిస్తున్నారా, నిద్ర మాత్రలు విక్రయాలు చేస్తున్నారా అంటూ మందుల షాపుల నిర్వాహకులను ప్రశ్నించడంతోపాటు రోజూ వారీ మందుల అమ్మకాల వివరాలను పరిశీలించారు. చిన్న వయస్సు వారికి మత్తు మందులు విక్రయిస్తున్నారన్న అనుమానాలు రావడంతో ఈ తనిఖీలు చేస్తున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం సిఐ నరసింహారావు, ఔషద నియంత్రణ శాఖ అధికారులు మీడియాతో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం నిషేదించిన మందులు మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారా.. ఔషద నియంత్రణా చట్టానికి లోబడి నిద్ర మాత్రలు కోనుగోలు చేయడం, అమ్మకాలు చేయడం వంటివి జరుగుతున్నాయా లేక అందుకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయా అన్న అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

గిరిజన చిన్నారుల విద్యను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-ఉలవపాడు

స్థానిక కోటిరెడ్డి గుంట గిరిజన కాలనీ చిన్నారులకు, వయోజనులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లతా మాట్లాడుతూ మనిషిని ఉన్నత స్థానంలో ఉంచేది విద్య అని గిరిజన చిన్నారులు చక్కగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆమె అన్నారు. అదేవిధంగా సాయంకాలం సమయంలో విద్యార్థులకు ట్యూషన్ చెప్పుటకు ఒక ట్యూటర్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను తమ వెంట పొలం పనులకు తీసుకొని పోకుండా గిరిజన చిన్నారులకు ప్రభుత్వ ఏర్పరిచిన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పథకం వియోగించుకోవాలని పేర్కొన్నారు.





చలివేద్రం ప్రారంభిస్తున్న సురేష్ రెడ్డి

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణ ప్రజలకు చిరపరిచితులు, ప్రజావసరాలకు ముందుండి తన వంతు సహాయం అందించే కందుకూరు సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సన్నారెడ్డి సురేష్ రెడ్డి ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా తన తండ్రి సన్నారెడ్డి రామి రెడ్డి పేరు మీద చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం దీనిని ప్రారంభించారు. ఈ వేసవి కాలంలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు నిరంతరం మంచి నీరు అందించే చలివేంద్రాన్ని స్థానిక సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ ముందు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, స్థానికులు హాజరయ్యారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కందుకూరు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేష్ బాబు కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కందుకూరు అన్నక్యాంటీన్‌లో ఉదయం అల్పాహారం మధ్యాహ్నం సాయంత్రం ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఈ ఉచిత భోజన వసతి కార్యక్రమానికి ఆర్థికంగా సహకారం అందించిన వారు వలేటివారిపాలెం మండలం లోని బడేవారిపాలెం గ్రామనివాసి హైదరాబాద్ లో బిల్డర్ గా ఉన్న కోరుకొండ అంజిబాబు ఏర్పాటు చేశారు.



ఎంఎల్ఎ నాగేశ్వరరావుని సత్కరిస్తున్న దృశ్యం

ఎంఎల్ఎ నాగేశ్వరరావుకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలోని ఎస్‌సి మాదిగ నాయకులు శుక్రవారం కందుకూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించినందుకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించిన ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్య సుప్రీంకోర్టు తీర్పుతో గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ , శాసనమండలిలో వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు , సహకారం అందించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి , తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలో దోమల సమస్య,పారిశుధ్యం, డ్రెయినేజీ, కుళాయిలలో వస్తున్న కలుషిత నీటి సమస్యను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక బాలాజీ నగర్ సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీ అనంతరం సచివాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి. సూర్యనారాయణ, కాయంబు శ్రీనివాసులు మాట్లాడారు. నగరంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దోమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విష జ్వరాల బారిన బడి అనారోగ్యంతో ప్రజలు ఆస్పత్రులకు క్యూకడుతున్నారన్నారు. పారిశుధ్య సిబ్బంది తగినంత మంది లేక చెత్త పేరుకుపోయి ఉందన్నారు. కార్పొరేషన్ బడ్జెట్లో వందల కోట్ల రూపాయలు దోమల నిర్మూలన కోసం డ్రా చేస్తున్నారని ఆచరణలో చిన్నపాటి చర్యలు కూడా చేపట్టడం లేదని తెలిపారు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెన్నా నది ఒడ్డునే ఉన్నప్పటికీ తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరక్క ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నెల్లూరు సిటీలో అన్ని వార్డులలో కుళాయిలలో కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. తక్షణమే దోమల నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలని, ప్రధాన డ్రెయినేజీ కాలువలలో పూడికతీత తీయాలని బేటెక్స్ ఆయిల్ స్ప్రే చేయాలని, ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభా నగర విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు : బీపీ నరసింహ, ఎన్.వి సుబ్బమ్మ, కె.వి.రమణారెడ్డి, అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి, మూలం ప్రసాద్, షేక్ ఫయాజ్, కె. ఏమేలు, శాఖ కార్యదర్శులు కే సంపూర్ణమ్మ, టీ.భాగ్యమ్మ ఎన్.ఆదిలక్ష్మి, స్థానిక నాయకులు సుధాకర్, పద్మమ్మ, రెహనుమా కుమారమ్మ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

కార్పొరేషన్ షాపులకు వేలం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థకు చెందిన షాపులకు స్థానిక చిన్న బజారులోని ఏ.సీ సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. పై వేలంపాటలో 10 మంది పాట దారులు పాల్గొన్నారు. వేలంపాటలో పాల్గొన్న వారు రెండు లక్షల రూపాయల నాన్ రీఫండబుల్ దరావత్తు రుసుంను చెల్లించారు. వేలంపాటలో 13 షాపులకు గానూ పప్పుల వీధి షాపింగ్ కాంప్లెక్స్ లో ఒక దుకాణం, ఏసీ సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఒక దుకాణం, సుబేదారు పేట షాపింగ్ కాంప్లెక్స్ లో ఒక దుకాణాన్ని దక్కించుకున్నారు. వేలం నిర్వహణలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంపై అవగాహన

ప్రజాశక్తి-ఉలవపాడు

వీరేపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ కె. వెంకట సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ టి. శ్రీనివాసులు, వ్యవసాయ అధికారిని తిరుమల జ్యోతి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి వరి కొనుగోలు కేంద్రం చాగల్లు వద్ద అమ్ముకోవాలని వారికి ప్రభుత్వం వారు క్వింటాకి రూ.2320/- మద్దతు ధర కల్పించుట జరుగుతుందని తెలియజేశారు. రైతులందరూ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ సుమలత, రైతులు లక్కంరాజు. నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ అధికారి


మాట్లాడుతున్న తహశీల్దారు నిర్మలానందబాబా

క్లెయిమ్‌ల పరిష్కారంలో అలసత్వం వద్దు..

ప్రజాశక్తి-కోవూరు

బూత్ లెవెల్ అధికారులు ఓటర్ల నుంచి వచ్చే క్లెయిమ్‌ల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యం లిస్టులో మృతి చెందిన వారి ఓట్లు తొలగించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించడమే కాకుండా డెత్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. దాంతో పోలింగ్ స్టేషన్లను వారు పరిశీలించి అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. అదేవిధంగా స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించే సమయంలో తప్పనిసరిగా బిఎల్ఒలు వారి కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఓటరుకు మాట్లాడే విషయంలో పాజిటివ్ ధోరణిలో ఉండాలని ఆయన బిఎల్ఒలకు సూచించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు బిఎల్ఒలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధా, మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన బిఎల్ఒలు ఉన్నారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

నెల్లూరు టౌన్ హాల్‌లో 12వ తేదీ న్యూ మార్షల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో అండర్ -10, 12 విభాగాల్లో బుచ్చిరెడ్డిపాలెం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ప్రతిభ చాటిన విద్యార్థిని, విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వల్ల శరీర దృఢత్వంతో పాటు తన రక్షణ తాను పొందవచ్చన్నారు. ప్రై మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్లో 27మంది పాల్గొనగా అందులో 8 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను మార్షల్ ఆర్ట్స్‌పై ప్రోత్సహించిన తల్లిదండ్రులను, స్కూల్ ప్రిన్సిపల్ రామాంజనేయులు, స్కూల్ సిబ్బందిని, మార్షల్ ఆర్ట్స్ స్టేట్ సెక్రటరీ ఇబ్రహీంను ఆమె అభినందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డి.బాలకృష్ణ, వైస్ చైర్మన్ పఠాన్ నస్రీన్ ఖాన్, యడవల్లి శివకుమార్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'తటవర్తి'



ప్రజాశక్తి-బిట్రగుంట

మతిస్థిమితం లేని సంపంగి భూదేవి అనే మహిళ 11నెలల క్రితం రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం నుంచి తప్పిపోయి కావలికి చేరుకోవడం జరిగింది. కొందరు ఆర్యవైశ్య నేతలు ఆ మహిళ వివరాలను సేకరించేందుకు సామాజిక మాధ్యమాలలో ఫొటోను పెట్టడం జరిగింది. సమాచారం తెలుసుకున్న సంపంగి భూదేవి కుటుంబ సభ్యులు ఆర్యవైశ్య సంఘాన్ని సంప్రదించారు. శుక్రవారం 1వ పట్టణ సిఐ ఫిరోజ్‌ఖాన్ సమక్షంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు ఆర్యవైశ్య సంఘం సభ్యులు సంపంగి భూదేవిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. మహిళ కుటుంబ సభ్యులు ఆర్యవైశ్య సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ ఫిరోజ్ మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్‌ను వారి సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ ఓరుగంటి రామకృష్ణ, ట్రెజరర్ కళ్యాణ్ చక్రవర్తి, సభ్యులు ఓరుగంటి సురేష్ బాబు, రేలంగి శివ, చేమూల సునీల్, చెక్కు అజయ్, గంగిశెట్టి నందకిషోర్, మధు రెడ్డి, గారంశెట్టి మధు, వివిఎస్, ఆర్.మాలి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అర్హులైన బిసి కులాల మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించే పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని మహిళలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా టైలరింగ్ శిక్షణ ఇచ్చి నూతన కుట్టుమిషన్ అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుండి 50ఏళ్ల మధ్య వయసు కలిగి తెల్లరేషన్ కార్డు, ఆధారు, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు 45 రోజులకు 8 గంటలు, 60 రోజులకు 6 గంటలు లేదా 90 రోజులకు 4 గంటలు శిక్షణ కాలాన్ని ఎంపిక చేసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ఎంపిక చేయబడిన అభ్యర్థులకు 75 శాతం పైగా హాజరు కలిగి పూర్తిస్థాయి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్, కుట్టు మిషన్ ఉచితంగా అందజేయబడుతుందని తెలిపారు. అర్హత కలిగిన మహిళలు సచివాలయంలోని వెల్ఫేర్ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని మహిళలు టైలరింగ్ మిషన్, శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, అందులో భాగంగా గ్రామీణ ప్రాంత మహిళలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా ఉచిత కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలియజేశారు. ఈ పథకంలో మండలంలోని కాపు(బలిజ), వారికి సంబంధించి నలుగురికి, కమ్మ 13, రెడ్డి 18, ఈ బీసీ 12, ఆర్యవైశ్య 5, బ్రాహ్మణ 4, క్షత్రియులు ఒకటి, బిసి 25 మొత్తం 82 కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని ఆమె తెలియజేశారు. అప్లికేషన్ వేసేటప్పుడు 45 రోజులకు 8 గంటలు, 60 రోజులకు 6 గంటలు, 90 రోజులకు నాలుగు గంటలు ఇవి ఉన్నప్పుడు ఎంపిక చేసుకొని, సెలక్ట్ అయిన తర్వాత కచ్చితంగా 75శాతం హాజరు నమోదు కావాలని అలా శిక్షణకు హాజరైతేనే ఉచిత కుట్టు మిషన్ మంజూరు చేస్తామని తెలిపారు.

శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి పట్టణానికి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమపూజ్య శ్రీ ప్రణ్నానంద సరస్వతి బాల స్వామిజీ వస్తున్నారని వారి చేతుల మీదగా శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం జరుగుతుందని కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్ శుక్రవారం తెలిపారు. ఆయన తన కార్యాలయంలో కళ్యాణ మహోత్సవ పోస్టర్లను ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్ మాట్లాడుతూ గోవిందుని పాద సేవలో తెనాలి నుండి తిరుమల వరకు పాదయాత్రగా వెళ్ళిన పెనుగొండ పీఠాధిపతి బాల స్వామిజీ చేతుల మీదుగా 24వ తేదీన కావలి బృందావనం కళ్యాణ మండపంలో సాయంత్రం 5:30గంటలకు శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని కావలి ఎడవల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం నుంచి వైరల్ ఫీవర్ వచ్చి కాళ్ళు చేతులు పట్టుకుని పోయి నానా అవస్థలు పడుతున్నామని, వేలకు వేలు ప్రయివేట్ హాస్పిటల్‌లో చూపించుకుంటున్నట్లు తెలిపారు. కావున ఈ విషయాన్ని వైద్యాధికారులు, పంచాయతీ పాలకులు గుర్తించి, శానిటేషన్ మెరుగుపరచాలని, మెడికల్ క్యాంపు ప్రత్యేకంగా నిర్వహించాలని, మళ్లీ వైరల్ ఫీవర్, మలేరియా తదితర విష జ్వరాలు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని తెలియజేశారు. అదే విషయాన్ని సంబంధిత డాక్టర్ జ్యోతిరాణిని ఫోన్‌లో సంప్రదించగా గతంలో రెండుసార్లు మెడికల్ క్యాంపు నిర్వహించామని, మరలా గ్రామస్తుల విన్నపం మేరకు మెడికల్ క్యాంపు, ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ విషయంపై స్థానిక నాయకులతో సంప్రదించగా పంచాయతీ తరపున, ఒకటికి రెండుసార్లు పారిశుధ్య పనులను చేశామని, జ్వరాల తగ్గుముఖం పట్టాయని తెలియజేశారు. ఏదేమైనా సరే మళ్లీ కావలి ఎడవల్లిలో పంచాయతీ అధికారులు సర్వంత ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామస్తుల విన్నపం మేరకు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు ఆవేదన చెందుతున్నారు.

పలుచోట్ల 'ప్రజా చైతన్య యాత్రలు'


మాట్లాడుతున్న గోగుల శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రజా చైతన్య యాత్ర కొనసాగుతుందని సిపిఎం సెక్రటేరియట్ సభ్యులు గోగుల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సిపిఎం కార్యాలయంలో నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలో అనేక గ్రామాలు తిరిగి సమస్యలపై నేతలు తిరుగుతున్నారన్నారు. ప్రజలు వారి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నేతలతో విన్నవించుకున్నారన్నారు. సమస్యలపై ప్రజలతో కలిసి సిపిఎం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా సిపిఎం పోరాడుతుందన్నారు. మండలంలో ముఖ్యంగా ప్రధాన సమస్యలైనా ముదివర్తి - ముదివర్తిపాలెం కాజ్వే నిర్మాణం, పెన్నా నది రివిట్ మెంట్ వాల్, గంగపట్నం పల్లిపాలెం వంతెన నిర్మాణం, మైపాడు బీచ్ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం వంటి ప్రధాన సమస్యలు మండలంలో ఉన్నాయన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు సిపిఎం తమ గళం విప్పుతుందన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మండలంలో ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కాని పక్షంలో మార్చి 29వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సిపిఎం కమిటీ సభ్యులు టివివి ప్రసాద్, మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరావు, రైతు సంఘం నాయకులు తిక్కవరపు ప్రభాకర్ రెడ్డి, వెన్న వేణు, ఖాదర్ భాషా, వెంకయ్య, మనోహర్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిలో..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 5వ రోజు బుచ్చిరెడ్డిపాలెం పట్టణం మంగళ కట్ట జగనన్న కాలనీలో పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళకట్ట జగనన్న కాలనీలో 300కు పైగా పక్కా గృహాలు ఉండగా వీటిలో సుమారు 70 నుంచి 80 వరకు పక్కా గృహాలు కొంతవరకే పరిమితం కాగా కొన్ని గృహాలు మాత్రం నాసిరకంగా కట్టడం జరిగిందన్నారు. ఈ కాలనీలో నివాసముంటున్న వారు మంచినీటి సదుపాయం లేక, డ్రెయినేజీ కాలువలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మంగళకట్ట కాలనీవాసులకు నగర పంచాయతీ తరపున వెంటనే మంచినీటి సదుపాయం డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని సిపిఎం తరపున ఆయన డిమాండ్ చేశారు. పక్కా గృహాలు పూర్తికాని వారు వారి గృహాల పనులు పూర్తి చేసుకుంటే కూటమి ప్రభుత్వం తరపున బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75 వేలు, ఇతరులకు రూ.లక్ష మంజూరు చేస్తామని వెంటనే పని ప్రారంభించాలని అధికారులు వారికి తెలిపారన్నారు. గృహాల పనులు పూర్తిచేసుకునే స్థితిలో ఇక్కడ వారు లేరని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి వారి గృహాలను పూర్తి చేసి అందించాలని సిపిఎం తరపున ఆమెను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె ఖాదర్‌బాషా, డివైఎఫ్ఐ అధ్యక్షులు కొమ్మి శ్రీనివాసులు, దత్తశ్రీ కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


ముత్తుకూరులో..

ప్రజాశక్తి-ముత్తుకూరు : బ్రహ్మదేవం పంచాయతీ సచివాలయంలో సిపిఎం బ్రహ్మదేవం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రజల సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి పలు సమస్యలపై అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, మండల కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌షా, బ్రహ్మదేవం శాఖ కార్యదర్శి పెద్దపుడి వెంకయ్య, ఎస్‌కె సలాం, మస్తానమ్మ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక టాస్క్‌ఫోర్సు : సిఐ



ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లపై ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసినట్లు సిఐ గంగాధర్ తెలిపారు. ఆత్మకూరులోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభం కానున్న ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా బెట్టింగ్‌లపై జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బెట్టింగ్ నిర్వహణ, పాల్గొనడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తమ సిబ్బంది హోటల్స్, టీస్టాల్స్, ప్రయివేట్ హబ్‌ల వద్ద ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎవరూ బెట్టింగ్‌ల జోలికి పోవద్దని ఆయన సూచించారు.

మినీవ్యాన్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-సంగం

ఆత్మకూరు వైపు నుండి నెల్లూరు వైపు పుచ్చకాయల లోడుతో వెళ్తున్న మినీవ్యాన్‌ను సంగం వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం బాగా దెబ్బతినగా కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ గంగా ప్రసాద్

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ లోపల, బయట ఆవరణలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి రోజు భోజనం ఎంత మంది తింటున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. భోజన పదార్థాలు నాణ్యతగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా క్యాంటీన్ నిర్వహణ సాగాలని, ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం భోజనం చేస్తున్న వారిని భోజన పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని చౌట భీమవరం పంచాయతీలోని పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సమయంలో ఎంఇఒ సాయిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ చౌట భీమవరం గ్రామస్తులు పిల్లలకు వడ్డిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని, తమ దృష్టికి తీసుకురావడంతో తనిఖీ చేశామని, తాము వెళ్లిన సమయంలో వండిన ఆహారాన్ని తిని, పరిశీలించామన్నారు. అయితే మెనూ ప్రకారం భోజనం సంతృప్తికరంగానే వండారని తెలిపారు. ఆహారంలో ఎలాంటి పురుగులు లేవని తెలియజేశారు.

అర్హులందరికీ సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-బిట్రగుంట

అర్హులైన ప్రతి ఒక్కరికీ సిఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రభుత్వం అందజేస్తుందని ఎంఎల్ఎ దగ్గుబాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కావలి టిడిపి కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత చంద్రబాబు సహకారంతో అభివృద్ధి సంక్షేమం ఎజెండాగా టిడిపి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రూ.3,17,09,492 సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. నేడు 92మంది లబ్ధిదారులకు రూ.80,79,427 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశామని, సిఎం సహకారంతో చెక్కులు పంపిణీలో రాష్ట్రంలో కావలి రెండోస్థానం, జిల్లాలో నెంబర్ వన్‌స్థానంలో ఉన్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారుడు తమ పేర్లను నమోదు చేసుకున్న నెల రోజుల్లోనే సిఎం సహాయనిధి లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత టిడిపి ప్రభుత్వానిదని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద అందుబాటులోకి రాని వైద్య ఖర్చులు సిఎం సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు అందుతున్నాయని, కొండ బిట్రగుంట బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు, అధికారులు, మీడియా సహకారంతో వైభవంగా జరిగాయని బ్రహ్మోత్సవాలకు సహకరించిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కావలి నియోజకవర్గం అసెంబ్లీలో మాట్లాడామని, చంద్రబాబు సహకారంతో కావలి నియోజకవర్గాన్ని అభివద్ధి పదంలో నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ కృష్ణారెడ్డి


27నుంచి ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి-మర్రిపాడు

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మార్చి 27 నుండి 29వ తేదీ వరకు గుంటూరు సమీపంలోని లాంఫాంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్లు కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ జి.లలితశివ జ్యోతి తెలియజేశారు. దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రైతులకు ఉపయోగపడేలా కేంద్ర వ్యవసాయ శాఖ నిర్ణయించిందన్నారు. చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సు జరుగుతుందన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల నుంచి రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. రైతు సదస్సుతో పాటు వివిధ వ్యవసాయ అనుబంధ శాఖల సాంకేతిక తను ప్రదర్శించడానికి సుమారు 300 వరకు స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. రైతులు భారీగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ తీగలను తొలగించండి సారూ..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం


ఇంటిపై ఉన్న కరెంటు తీగలు


ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని మంగళకట్ట జగనన్న కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో తమకు పక్కా గృహాలు మంజూరైనప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో నిర్మించుకునేందుకు వీలు లేక అవస్థలు పడుతున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణంలో భాగంగా స్లాబు వేసుకునేందుకు ఇంటిపై వెళ్లిన విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్టు కాలనీవాసులు తెలిపారు. అయితే వాటిని తొలగించాలంటే విద్యుత్ శాఖకు రూ.40వేలు డిపాజిట్ చేయాలని పట్టణ విద్యుత్ అధికారులు కోరినట్లు కాలనీవాసులు వాపోయారు. అప్పుచేసి జగనన్న ఇంటిని నిర్మించుకుందాం అనుకుంటే విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించమని అధికారులు కోరితే వారు డిపాజిట్ ద్వారా నగదును జమ చేయమనడం దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు దయ చూపి తమ ఇళ్లపై వెళ్ళిన విద్యుత్ తీగలను తొలగించాలని మంగళకట్ట జగనన్న కాలనీవాసులు కోరుతున్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మండల పరిధిలోని డక్కునూరు ఎస్‌సి కాలనీలో రూ.8 లక్షలతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌కు శుక్రవారం మండల కన్వీనర్ చండ్రా మధుసూదన్ రావు, జెడ్‌పిటిసి రావిళ్ల నాగేంద్ర, మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య నూతన బోరుకు టెంకాయ కొట్టి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చి రూ.8 లక్షల నిధులను మంజూరు చేయించారని అటువంటి ఎంఎల్ఎ ఎవరూ లేరన్నారు. గ్రామాలలో మట్టిరోడ్లను సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో అన్ని గ్రామాలలోని వీధులన్నీ సిమెంట్ రోడ్లుగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆకారంతో తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ తమపై ఉన్న ప్రేమతో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ యుద్ధ ప్రాతిపదికన మినరల్ వాటర్ ప్లాంట్‌కు బోరు వేయించి పనులు ప్రారంభించినందుకు ఆయనకు మండల కన్వీనర్ మధుసూదన్ రావుకు, నాగేంద్రకు వెంకయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఎస్‌సిసెల్ నాయ కులు లాభాన్, సుకుమార్, గ్రామస్తులు హరి చంద్ర ప్రసాద్, మనోజ్ కుమార్, వివేకానంద, తెల్లయ్య, అశోక్, గిరి ప్రతాప్, సుబ్బారావు, మాల్యాద్రి, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


పూజ చేస్తున్న నాయకులు


సన్మానిస్తున్న సిబ్బంది

జైల్ సూపరింటెండెంట్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు సబ్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న విజయ్ కుమార్ నెల్లూరు ప్రధాన జైలుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానంలో నెల్లూరు జైలు సూపరిండెంట్ గా అరుణ్ కుమార్ బదిలీ అయ్యారు. దాంతో శుక్రవారం బదిలీపై వెళ్తున్న, వచ్చిన వారిని సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఖైదీలలతో ప్రేమతో వ్యవహరిస్తూ వారిలో మార్పు తీసుకొచ్చేందుకు విజయకుమార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది మూర్తి, దాసు, ఖాజా రహమతుల్లా, అంకయ్య, విఆర్ఒ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరులోని శాంతినగర్లో ఉన్న లక్ష్మీపార్వతి వృద్ధాశ్రమంలో ఉన్న వద్ధులకు ఎన్‌హెచ్‌సిఐ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ పర్యవేక్షణలో వృద్ధులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల వాడకంలో నిర్లక్ష్యం చూపకుండా క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ సందర్భంగా ఈ శిబిరంలో కావలి ఏరియా ఆస్పత్రికి చెందిన వైద్యులు డాక్టర్ క్రాంతి రోహిత్, డాక్టర్ టి.మాధవిలత, డాక్టర్ కె.శోభారాణి, డాక్టర్ పి.హిమబింధు, డాక్టర్ ఎన్.ప్రణయ్ కుమార్, డాక్టర్ రేవతి పాల్గొని వృద్ధులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు.



పొగాకు బేళ్లు వేలం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి తిక్కవరం క్లస్టర్‌కు చెందిన రైతులు 320 పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా 308బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 12పొగాకు బేళ్లను వేళానికి తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ బి 02,బి ఆర్ 01, అధిక బరువుతో ఉన్న 09బేళ్ళను తిరస్కరించినటుల తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.265, సగటు ధర రూ.278.34 నమోదైంది. వేలంలో 7మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ట్రై సైకిళ్లు పంపిణీ


ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



వికలాంగులకు ఆసరాగా నిలిచేందుకు వి.పి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చేపడుతున్న ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం 23న ఆదివారం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరులో ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. అదేవిధంగా నియోజకవర్గస్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే కోవూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో ట్రై సైకిళ్ల పంపిణీ పూర్తి చేశారన్నారు. ఆత్మకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో నిర్వహించే ఏర్పాట్లు స్థానిక నాయకులు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కార్యాలయ బాధ్యులతో కలిసి శుక్రవారం సభా వేదిక పరిశీలించారు. ఆత్మకూరులో కార్యక్రమ నిర్వహణ కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రౌండ్ క్లియరెన్స్ చేశారు. జెసిబిలు పెట్టి మైదానాన్ని శుభ్రం చేశారు. షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. మోటార్ ట్రై సైకిళ్ల పంపిణీకి, ఆత్మీయ సమావేశానికి వేర్వేరుగా వేదికలు నిర్మిస్తున్నారు. సమావేశాలకు వచ్చేవారి కోసం ప్రత్యేకంగా భోజన వసతి కల్పిస్తున్నారు. ట్రై సైకిళ్ల లబ్ధిదారులకు ఉదయం టిఫిన్ కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం నాటి సమావేశానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లను శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ మండలం అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలయ్య చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థకు రవికుమార్ రాజీనామా

ప్రజాశక్తి-బిట్రగుంట



కావలి కచేరి మిట్టలో ఉన్న బ్లెస్సింగ్ హోమ్, మీకోసం స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యుడులు, మాజీ కాంగ్రెస్ మండల కన్వీనర్ ఎం ఎ రవికుమార్ రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు రవి కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థలు తమ వంతుగా సేవలు అందించామని, కొన్ని అనివార్య కారణాల వల్ల స్వచ్ఛంద సేవ సంస్థకు రాజీనామా చేస్తున్నానని, రాజీనామా వ్యక్తిగత కారణం అని, ఎవరికి ఎటువంటి సంబంధం లేదని తెలియజేశారు.